# భావుకత

--జి. రేణుకాదేవి.

కప్పుకున్న దుప్పటి జారిపోవడంతో చలికి మెలుకువ వచ్చి బద్ధకంగా కళ్లు తెరిచాడు ప్రదీప్. పక్షులు కిల కిల రావాలు చెవిన బడటంతో అప్పుడే తెల్లవారిందా అనుకుంటూ తలత్రిప్పి ప్రక్కకు చూసాడు. ఎదురు కిటికీలోనుండి తెల్లవారడానికి సిద్ధంగా ఉన్నట్లు కనబడుతోంది ఆకాశం ప్రదీప్ మెల్లగా లేచి స్లిప్పర్స్ కాళ్ళకు తగిలించుకొని. ప్రక్కనే ఉన్న శాలువా తీసుకొని నిండా కప్పుకొని వచ్చి కిటికీ దగ్గర నిలబడ్డాడు.

అప్పుడప్పుడే .తెల తెల వారుతోంది. మంచు ముసుగు వేసుకున్న ప్రకృతి మసక మసగ్గా కనబడుతోంది. పక్షుల గూళ్ళలో కోలహలం బయలుదేరింది. జారిపోతున్న శాలువాను భుజాలమీదకు లాక్కుంటూ కిటికీలోనుండి పరిసరాలను మైమరిచి చూస్తున్నాడతడు. అది అతని ప్రభాతకాలపు దినచర్య. ప్రకృతిని చూస్తే తనను తాను మరిచిపోతాడు. ఆ ప్రభాతకాలపు అందాలను చూస్తుంటే అతని హృదయం ఏదో తెలియని గొప్ప అనుభూతికి లోనవుతుంది ఆ సమయంలో అతనికి ఆ అనుభూతుల్ని ఎవరితోనైనా పంచుకోవాలనిపిస్తుంది.

"కాఫీ తీస్కోండి" అనే భార్యమాటతో బాహ్యాప్రపంచంలోకి వచ్చాడు ప్రదీప్. ఆమె వైపు తిరిగి చూసాడు చలికి సన్నగా కంపిస్తున్న ఆమె చేతిలో సువాసనలు వెదజల్లుతున్న కాఫీ కప్పు. అప్పుడు సమయం ఆరైందన్నమాట. సరిగ్గా ఆరింటికి అతని చేతికి కాఫీకప్పు ఇస్తుంది అతని భార్య. కాఫీ



చూడగానే అతని ఉత్సాహం పెరిగింది. వెచ్చగా శాలువా కప్పుకొని వేడి వేడి కాఫీ త్రాగుతూ ఆ కిటికీ లో నుండి ప్రకృతిని చూడడం అతనికి గొప్ప అనుభూతి.

"కాఫీ తెచ్చావా గుడ్" అంటూ కప్పు చేతిలోకి తీస్కొని. "రాధా ఈ కిటికీ లోంచి చూడు ప్రకృతి ఎంత అందంగా కన్పిస్తుందో! ఆ చెట్ల ఆకులపై రాత్రి కురిసిన మంచుబిందువులు ఎంత అందంగా ఉన్నాయో చూడు. నువ్వు కాస్సేపు ఇక్కడే వుండు **బాలభానుడి కిరణాలు ప్రసరించగానే** మంచుబిందువులు క్రిందికి జారుతూ ఎంత అందంగా మెరుస్తాయో చూద్దువుగాని, అసలు ప్రకృతి లోని అందాలు కనిపించేవి శీతాకాలంలోనే నాకందుకే శీతాకాలమంటే ఇష్టం అంటూ తన్మయంగా చెప్పుకు పోతున్నాడు ప్రదీప్.

భర్త చెప్పాడు కాబట్టి కిటికీలో నుండి చూపుల్ని సారించిందే కాని ఆమె దృష్టి అక్కడ నిలవడం లేదు. ఆమె దృష్టి పిల్లల మీద నుండి జారిపోతున్న దుప్పటి మీదకు పోతుంది. ఆమె మనసు స్టౌ మీద పెట్టిన పాల మీదకు పోతోంది. దుప్పటి జారిపోయి చలికి పిల్లలు నిద్ర లేస్తే, అమ్మో! ఇంకేమైనా ఉందా ఏడుస్తూ పనులు చేసుకోనియకుండా అడ్డు పడతారు.

"బావుందండీ! నేనిక్కడ ప్రకృతి అందాలను చూస్తూ కూర్చుంటే ఇంట్లో పనెవరు చేస్తారు". భర్త చిన్నపుచ్చుకుంటాడేమోనని సాధ్యమయినంత వరకు చలికి పగిలిన పెదవుల మీదకు నవ్వును తెచ్చుకుంటూ చెప్పింది.

"అబ్బా! ఎప్పుడూ పని పని అంటావు. కాస్త ప్రకృతిని ఆరాధించడం నేర్చుకో." అంటూ ఇంకా ఏదో చెప్పబోతున్న భర్త మాటలకు మధ్యలోనే అడ్డుపడి "ఆ! నేనిక్కడ ప్రకృతి, అందాలు అంటూ కూర్చుంటే వంటింట్లో పాలు పొంగి పోతాయండీ మరోసారి బలవంతంగా పెదాలపైకి నవ్వును తెచ్చుకొని చెప్పింది. చలికి పగిలిన పెదాలు నవ్వినప్పుడు చిట్లి భగ్గున మండాయి. ఆ మంటను పట్టించుకోకుండానే పిల్లల మంచం దగ్గరకు వెళ్ళి నిండా దుప్పటి కప్పింది. చలికి మొద్దు బారినట్లయిన చేతులకు రాపిడి కలిగిస్తూ ఆ గదిలోంచి బయట పడింది. నడుస్తున్నప్పుడు గచ్చు మంచులా చల్లగా పాదాలకు తగుల్తుంటే మనసులో" వెధవ చలికాలం ఎప్పుడు పోతుందో ఏమో ఇలా చలి చంపుతుంటే ఏ పని చక చకా చేస్కోవడానికి వీలు కాదు కదా! అని తిట్టుకుంటూ వంటింట్లోకి వెళ్ళింది. అప్పటికే పాలు పొంగటానికి సిద్ధంగా ఉన్నాయి. గబా గబా పరిగెత్తుకుంటూ వెళ్ళి పాలు దించేసి ఇతర పనుల్లో పడింది.

* * *

"రాధా క్యారియర్ సర్దేశావా" డ్రాయింగ్ రూంలో నుండి కేకేసాడు ప్రదీప్.

"ఒక్క నిమిషం ఆగండీ అయిపోతుంది." హడావుడిగా వంటింట్లో పనులతో సతమతమవసాగింది రాధ.

"ఒక్క నిమిషం ఒక్క నిమిషం అంటూ ఎంతసేపు చేస్తున్నావు. ఎనిమిదిన్నరయింది. తొమ్మిది గంటల కల్లా ఆఫీస్‌లో ఉండాలి. ఇంతవరకు నువ్వు క్యారియర్ సర్దలేదు. అసలేం చేస్తున్నావ్ ఉదయం నుండీ..." పాఠం చదివినట్టు చదువుతున్నాడు ప్రదీప్.

సూర్యోదయమయి చెట్ల ఆకుల మీది మంచు బిందువులన్నీ ఆవిరయ్యేదాక ప్రకృతి సౌందర్యోపాసనలో మునిగి పోయి భార్య ఆఫీస్‌కి టైమవుతుందని గుర్తుచేసాక హడవుడిగా స్నానాదికాలు ముగించుకొని టిఫిన్ చేసి నీట్‌గా డ్రస్ చేసుకొని తిరిగ్గా కూర్చొని పేపర్ తిరిగేస్తూ భార్యను సాధిస్తున్నాడు ప్రదీప్.

కాఫీ, టిఫిన్, అన్నం, కూరలూ ఒక్కోటి వరసగా చేస్తూ, మధ్యలో భర్త స్నానానికి నీళ్ళు, బట్టలూ, టవలూ అందిస్తూ, నిద్రలేచి ఏడ్చేపిల్లను సముదాయిస్తూ, వాళ్ళ అవసరాలు, ఆకళ్ళూ తీరుస్తూ, త్రాగిన కప్పు కాఫీ ఎప్పుడో ఆవిరైపోగా, చలిమాయమై పోయి చెమటలు పట్తూంటే హడావుడిగా వంటింట్లో అటూ ఇటూ తిరుగుతూ పనులతో సతమతమవసాగింది రాధ. భర్త మాటలను నిర్లిప్తంగా వింటూ సమాధాన మేమీ చెప్పకుండా క్యారియర్ సర్ది బ్యాగ్‌లో పెట్టేసి భర్త చేతి కిచ్చింది. బ్యాగ్ తీసుకొని ఆయన వెళ్ళిపోయాక హాయిగా ఊపిరి పీల్చుకునేంతలో ఏదో భల్లున పడి పోయిన చప్పుడు వెనువెంటనే పిల్లాడి ఏడుపు వినిపించి గబా గబా రూం లోకి పరిగెత్తింది.

* * *

ఆ రోజు హాఫ్‌డే కావడంతో మధ్యాహ్నం మూడు గంటల కల్లా ఇంటి కొచ్చాడు ప్రదీప్. అతను వచ్చినప్పుడు బాగా ఎండగా వుంది. ఓ అరగంట తర్వాత ఎండగా ఉండగానే ఉన్నట్టుండి వర్షం పడసాగింది. బెడ్ మీద పడుకున్న ప్రదీప్ "వర్షం పడుతున్నట్లుందే" అంటూ కిటికీ దగ్గరకు చేరాడు.

సరిగ్గా ఆ సమయానికే పిల్లాడికి పాలు పడుతున్న రాధ ఒక్కసారి ఉలిక్కిపడి "అయ్యోయ్యో! వర్షం పడుతుందా. డాబామీద పప్పులు ఎండబెట్టానండీ! బట్టలు కూడా ఆరేశానండీ! ఇప్పుడెలా? ఏమండీ! కాస్త సాయం చేద్దురూ" పాలు త్రాగుతున్న పిల్లాడిని గబుక్కున లాగేసి నేలపై పడుకోబెట్టి కంగారు పడసాగింది రాధ.

"అబ్బా! ఆపవోయ్ నీ సొద. ఎండా **వానా ఎంత అద్భుతమైన సీను ఆ ఎండలో** వర్షపు చినుకులు ఎంత అందంగా మెరుస్తున్నాయో చూడు" తన లోకంలోకి వెళ్ళిపోయాడు ప్రదీప్.

అప్పటికే డాబామెట్లు సగం ఎక్కేసింది రాధ. పైకి పరిగెత్తి తడిస్తే పప్పులూ పాడవుతాయని ఓ పాతచీరలో ఎండబెట్టిన పప్పులను, అదే చీరలో మూటగా చేసి పట్టుకొని పరిగెత్తినట్లు క్రిందకు దిగి క్రింద వాటిని పెట్టి మళ్లీపైకి పరిగెత్తి పైన ఆరేసిన బట్టలన్నీ గబాగబా తీసుకొని క్రిందికి దిగింది. ఈ లోగా ఎండ పోయి వర్షం పెద్దదయింది. ఆరేసిన బట్టలు ఆమె కట్టుకున్న బట్టలు తడిసిముద్దైపోయాయి. ఆమెలో రొప్పు, ఆయాసం వచ్చేసాయి.

"ఛీ! ఛీ! వెధవవర్షం ఉన్నట్టుండి పడి కంగారు పెట్టేసింది." తడిసిన బట్టలన్నీ ఇంట్లోనే వీలయిన చోట్ల ఆరేస్తూ పైకే తిట్టేసింది రాధ.

"చాల్లే ఏమిటా మాటలూ వర్షం పడుతుంటే ఎంత హాయిగా ఉంటుంది. దూరాన కొండ చూడు వర్షంలో ఎలా మసక మసగ్గా కనబడుతుందో! వర్షపుచినుకులు నేలపై పడుతుంటే ఆ చప్పుడు చూడు సంగీతంగా వీనుల విందు చేస్తుంది. ఆ మట్టి వాసన చూడు ఎంత ఇంపుగా ఉందో. ఈ కిటికీ దగ్గర నిలబడితే గాలి వీచినప్పడల్లా వర్షపు తుంపరలు మీదపడి వళ్ళు పులకరిస్తుంటే నువ్వేమిటలా వర్షాన్ని తిడుతావు అంటూ ఇంకా ఏదో ఏదో చెప్తున్న భర్తమాటల్ని మధ్యలోనే అడ్డుకొని.

"శుభ్రంగా ఆరిపోయిన బట్టలన్నీ తడిసి ముద్దయ్యాయి. వంటిమీది బట్టలు కూడా తడిసిపోయాయి. తిట్టకుండా ఎలా ఉంటాను" అంది రాధ.

"ఆ! తడిసింది బట్టలే కదా! ఆరిపోతాయిలే. అంత మాత్రానికే వర్షాన్ని తిట్టాలా.

అయినా నువ్వు కొంచెం కూడా ప్రకృతిని చూసి ఆనందించవే. వర్షించే మేఘాలను చూస్తే నీ హృదయం కాస్తకూడా స్పందించదా. ఇలా వర్షం పడుతుంటే ఆ వర్షాన్ని చూస్తూ వేడి వేడిగా ఏమన్నా తింటే ఎంత బావుంటుందో తెల్సా. అవునూ తిన డానికి ఏమన్నా చేయకూడదూ?" అంటూ భార్య వైపు చూసాడు అతడి కళ్ళు ఆజ్ఞాపిస్తున్నాయి.

భర్తవైపు ఓ సారి నిస్సహాయంగా చూసి, తడిసిన బట్టలు మార్చుకోకుండానే వంటింట్లోకి నడిచింది రాధ. బట్టలు మార్చుకొనే లోగా వర్షం ఆగిపోతే భర్త కోరిక తీరెదెలా?

* * *

"అదేంటీ ఈ లుంగీ ఇస్తున్నావు తెల్ల లుంగీ ఏమైంది?" స్నానానికి వెళ్ళబోతూ లుంగీ టవలూ అందిస్తున్న భార్యని ప్రశ్నించాడు ప్రదీప్.

"అది ఇందాక వర్షంలో తడిసిపోయిందండీ ఇవ్వాళ్టికి ఇది కట్టుకోండి."

"అబ్బా! నాకు సాయంత్రాలు రంగు లుంగీలు కట్టుకోవడం ఇష్టం ఉండదనీ తెల్సు కదా! అయినా అది తడిసిపోయేదాకా ఏం చేసావు? వర్షం వస్తుందేమోనని కాస్త జాగ్రత్తగా ఉండొచ్చుకదా." అంటున్న అతనివైపు అదోలా చూసింది రాధ.

ఆ చూపులో కోపమో, బాధో, అసహ్యమో, నిస్సహాయతో అన్నీ కలిసిన మరో భావమో, ఏ భావమూ లేని నిర్లిప్తతో అర్థంకాదు.

* * *

ఏడుస్తున్న పిల్లాడ్ని భుజానేసుకొని జోకొట్టసాగింది రాధ. రాత్రి వంట చేసి పెద్ద పిల్లాడికి అన్నం తినిపించి, చిన్న పిల్లాడికి పాలు పట్టి, భర్తకు వడ్డించి, తనూ తిని, వంటిల్లు సర్దుకునేప్పటికి పది గంటలయింది. గదిలో అటు యిటూ తిరుగుతూ పిల్లాడ్ని జోకొడుతుంటే కాళ్ళు భుజం లాగేస్తూ అలసటగా ఉందామెకు. కాస్సేపటికి నిద్రబోయాడు బాబు. వాడ్ని బెడ్‌మీద పడుకోబెట్టి దుప్పటి కప్పింది.

అంత వరకూ కిటికీ దగ్గర నిలబడి ఏకాగ్రతతో వెన్నెలను చూస్తున్న ప్రదీప్ "రాధా!" అంటూ పిలిచాడు తప్పదనుకుంటూ వెళ్ళి భర్తప్రక్కన నిలబడింది.

"రాధా ఈ రోజు పౌర్ణమి కదా! చంద్రుడు చూడు ఎంత అందంగా, నిండుగా ఉన్నాడో. వెన్నెల చూడు ఎంత హాయిగా ఉందో. ఆ కొబ్బరి చెట్టు ఆకులను చూడు వెన్నెల పడి ఎలా మెరుస్తున్నాయో. ఆ నంది వర్ధనం చెట్టును చూడు, పచ్చని చెట్టు నిండా విచ్చుకున్న తెల్లని పూలు వెన్నెల్లో ఎంత అందంగా కనబడుతున్నాయో" చెప్పుకు పోతున్నాడు ప్రదీప్.

రాధ చూపులు చంద్రుడిపై ఆకాశంపై ఒక్క క్షణం కూడా నిలువలేదు. ఆమె చూపులు అప్రయత్నంగా చెట్ల నీడలపై పడ్డాయి. నేల మీద నల్లగా ఆవరించుకున్న నీడలు ఒడలు విరబోసుకున్న దయ్యాల్లా కన్పించాయామెకు. భర్త చెప్పే మాటలేవీ పిల్లల పనితో అలసిపోయిన ఆమె శరీరం విశ్రాంతిని కోరుతోంది. కనురెప్పలు బరువెక్కుతున్నాయి. చంద్రుడు మబ్బుపట్టేసినట్టు, వెన్నెల మసక బారినట్టూ కనబడుతున్నాయామెకు.




ఉన్నట్టుండి పెద్దగా ఆవులించింది.

"ఓహ్! అప్పుడే నిద్రొస్తుందా! కాస్సేపయినా వెన్నెల్ని చూసి సంతోషంగా గడుపుదామని లేదే నీకు. ఆ వెన్నెలను చూస్తూ ఇద్దరం కబుర్లు చెప్పుకుంటూ కూర్చుంటే ఎంత బావుంటుంది. అయినా నిన్నని ఏం లాభం! నాలాంటి భావుకుడికి నీ లాంటి ఏ అభిరుచిలేని మనిషి భార్యగా దొరికింది ఏ చేస్తాను నా కర్మ."

అలాంటి మాటలకు అలవాటు పడ్డ ఆమె చెవులు వినబడ్డం మానేసాయి. మనసు పట్టించుకోవడం మానేసింది.

ఆమె చెవికా మాటలేవీ ఎక్కడం లేదు. ఆమె బుర్రకా మాటలేవీ అర్థం కావడంలేదు. ఆమెకు తెలుస్తుందొక్కటే తనకి బాగా నిద్రొస్తోందనీ ఆమెకు అర్థమవుతుందొక్కటే తన నిద్రనిప్పుడు నిర్దాక్షిణ్యంగా లాగేస్తాడనీ..... 'నిద్రపోవడం' అనే కనీస అవసరాన్ని కూడా తను స్వేచ్ఛగా తీర్చుకోలేక పోతోందని ఆమెకు బాగా అర్థమవుతోంది.

ఆమె మానసిక, శారీరక స్థితుల్నేమీ పట్టించుకోకుండా, ఆమె ఇష్టాయిష్టాలతో ఏ మాత్రం సంబంధం లేకుండా తనకు కావల్సిందేదో నిరాటంకంగా తీసుకొని హాయిగా నిద్రలోకి జారిపోతుండగా వినిపించింది - పిల్లాడి ఏడుపు గుక్కపట్టి ఏడుస్తున్న ఏడుపు, ఆకలి తీర్చుకోవడానికి ఏడుస్తున్న ఏడుపు!

"బాబేడుస్తున్నట్టున్నాడు చూడు వెధవ! నిద్ర చెడగొడతాడు" అసహనంగా విసుగ్గా పలికాడు.

గబగబా లేచి పిల్లాడ్ని వళ్లోకి తీసుకొని పాలివ్వసాగింది. ఆమె నిద్ర మత్తు పూర్తిగా వదిలిపోయింది. అమ్మ వడిలోకి తీసుకోగానే ఏడుపు మానేసి పాలు త్రాగుతూ కడుపు నిండగానే హాయిగా నిద్రపోయాడు వాడు. నిద్రపోయిన పిల్లాడ్ని పడుకోబెట్టి పిల్లలిద్దరికీ దుప్పటి కప్పి భర్త వైపు చూసింది. అతనప్పుడే గాఢ నిద్రలోకి వెళ్ళినట్టున్నాడు చిన్నగా గురకపెట్టి నిద్రపోతున్నాడు. ఆమెకు నిద్ర రావడం లేదు. పడుకోవాలనిపించలేదు. కిటికీ వైపుకి నడిచింది. తన భర్త ఎప్పుడూ నిలబడి చూస్తూ మైమరిచి పోయే కిటికీ దగ్గర నిలబడి చూపుల్ని బయటకు సారించింది. నల్లని చిక్కటి చీకటి కనిపించిదామెకు. తన భర్త ఈ కిటికీ దగ్గర నిలబడే సూర్యోదయాల్ని, సూర్యాస్తమయాల్ని, వెన్నెలనీ, వర్షాన్నీ, మబ్బుల్నీ మంచు బిందువుల్నీ చూస్తాడు. తనకేమిటీ ఏమీ కనపించడం లేదు. ఎటుచూసినా అంధకారమే తప్ప

మరేమీ కనిపించడం లేదు. ఆ చీకట్లోకి అలాగే చూస్తుండిపోయింది. ఉన్నట్టుండి ఆ చీకట్లో తన జీవిత చిత్రపటం గోచరించసాగింది. బాల్యమూ, యవ్వనమూ, పెళ్ళీ, పిల్లలూ అన్నీ ఒక్కొటి వరసగా గోచరిస్తున్నాయి.

అలవాటయిన ఓ చిరునవ్వు పెదాల మీదకు తెచ్చుకొని "నిద్రొస్తుందండీ!" సంజాయిషీ ఇచ్చినట్లుగా చెప్పింది.

"తప్పేదేముంది వెళ్ళిపడుకో. హాయిగా కాస్సేపు కబుర్లు చెప్దామన్న నీతో కుదరదుకదా!" చిరాగ్గా చెప్పాడు.

ఆలస్యం చేస్తే మళ్లీ ఎక్కడ వెన్నెల అందాల్ని వర్ణిస్తాడోనని వచ్చి పడుకుంది రాధ.

బెడ్‌మీద పడుకొని ఐదు నిమిషాల్లో నిద్రలోకి జారిపోయింది. ఆ నిద్రలోనుండి కలలోకి జారిపోయింది-

వెన్నెల పుచ్చపువ్వులా ఉంది. ఆ వెన్నెల్లో నంది వర్ధనం చెట్టుక్రింద పరుచుకున్న నల్లని నీడ. ఆ నీడలో తాను ఒక్కర్తె కూర్చొని ఉంది. ఆ ఏకాంతాన్ని భర్త ఆజ్ఞలూ, పిల్లల ఏడుపులూ భంగపరచలేవు. ఆ ఏకాంతంలో కూర్చొని పరిసరాల్ని చూస్తూ ఆనందిస్తుండగా ఉన్నట్టుండి తన నడుముకేదో చుట్టుకుంటున్న స్పర్శ --- ఉలిక్కిపడి చూసుకుంది. పాము! తన నడుమును చుట్టి మెల్లమెల్లగా పైపైకి ప్రాకుతోంది. విదిల్చుకోవాలని చూసింది కానీ అది వదలటం లేదు. ఇంకా బలంగా చుట్టేసుకుంటుంది చిత్రంగా పామును చూస్తే భయమనిపించడంలేదు కాని ఆ స్పర్శ జుగుప్సగా ఉంది. అది బలంగా చుట్టుకుంటుంటే ఉక్కిరి బిక్కిరిగా ఉంది.

చటుక్కున మెలుకువ వచ్చింది రాధకు. ఆమె మెదడు నిద్రావస్థనుండి కొంచెం తేరుకుని జాగృతావస్థలోకి వచ్చింది. కళ్లు తెరవడానికి ప్రయత్నిస్తోంది. కానీ అలసిన కనురెప్పలు ఎంతకీ విడివడటం లేదు. అవి నిద్రనే కోరుకుంటున్నాయి. జరిగింది కల అని అర్థమయిందామెకు. కానీ కల తాలూకు అనుభూతి ఇంకా అలాగే ఉంది. తన్నేదో ఇంకా చుట్టేస్తూనే ఉంది. ఏమిటది? మెల్లగా అర్థమయిందామెకు తనను చుట్టేస్తుంది భర్త చేతులని. అతనేదో మాట్లాడుతున్నాడు. ఆ మాటలేవీ ఆమె చెవికెక్కడం లేదు కానీ ఆమాటల కర్థాలు ఆమె మనసుకు బాగానే తెలుసు. ఇంకేం మాట్లాడుతాడు. బహుశా ఆమె అందాల్ని వర్ణిస్తాడు. ఎంతైనా సౌందర్యోపాసకుడు కదా! ఆమె కళ్ళు తెరవాలని ఏదో చెప్పాలని ప్రయత్నిస్తోంది కానీ కళ్ళు తెరవలేకపోతోంది. గొంతు పెగల్చలేకపోతోంది. కష్టము మీద గొంతు పెగల్చి-

"నాకు బాగా నిద్రొస్తోందండీ! ... ప్లీజ్ నన్ను డిస్టర్బ్ చేయొద్దు...." అన్నది **వేడుకోలుగా**

"ఆ! నీకు నిద్రరానిదెప్పుడు? ఎప్పుడూ పనీ.... లేకపోతే నిద్ర! అంతే మరో విషయాన్ని పట్టించుకోవు"... ఇంకా ఏదో విసుక్కుంటూ చెప్తున్నాడు.

భర్త ఎప్పుడూ ప్రకృతిని చూసి స్పందించవేం! సూర్యోదయాల్ని చూసి ఆనందించవేం! వెన్నెలను చూసి మురిసిపోవేం! వర్షాన్ని చూసి పులకరించవేం! అనే మాటలు గుర్తొచ్చాయి. నిజానికా మాటలు ఆమెకు క్రొత్తకాదు. కానీ ఈరోజు వెంటవెంటనే జరిగిన సంఘటనలు ఆమెకు గతాన్ని గుర్తుతెస్తున్నాయి.

చిన్నప్పుడు అన్నయ్యా తను ఇంటి ముందర అరుగుమీద నిలబడి సూర్యోదయాల్ని చూస్తూ మురిసిపోతున్న సమయంలో, అమ్మ తనను మాత్రమే పిలిచి పనులు పురమాయించిన రోజు, సాయంకాలం అన్నయ్యతో కల్సి సరదాగా షికారు కెళ్తానంటే తనను మాత్రమే అభ్యంతరం చెప్పి ఇంట్లో మూల కూర్చోబెట్టిన రోజులూ, వర్షం పడుతుంటే అన్నయ్యతో కల్సి సరదాగా "వానా వానా వల్లప్పా" అని ఆడుతుంటే తనను మాత్రమే వాతలు వచ్చేలా కొట్టిన రోజులు ఒక్కొక్కటీ గుర్తొచ్చాయి. అలా తను ప్రకృతినీ పరిసరాలను పట్టించుకోవడం ఎలా మరిచిపోయిందీ గుర్తొచ్చింది.

పెళ్ళయ్యాక భర్తకు ఏ అవసరం వస్తుందో, అతనికెప్పుడు, ఏ అసౌకర్యం కలుగుతుందో, పిల్లలు పుట్టాక వాళ్ళెప్పుడు ఏడుస్తారో వాళ్ళకి ఎప్పుడు ఆకలేస్తుందో.... ఇవన్నీ పట్టించుకుంటూ తన ఆనందాన్ని తన అవసరాల్ని, తన మానసికోల్లాసాన్ని, తన అభిరుచుల్ని ఎలా మరిచిపోయిందో ఒక్కొక్కటీ గుర్తుకు రాసాగాయామెకు.

ప్రకృతిని చూడటం మానసికోల్లాసాన్ని పొందటంలో కూడా ఆడ, మగల మధ్య ఎంత వ్యత్యాసం ఉందో ఆలోచించసాగింది. ఓ అయిదు నిమిషాలు తమ ఇష్టానుసారంగా చల్లగాలిని పీల్చుకోవడం కూడా చాలామంది ఆడవాళ్ళకి సాధ్యం కాదనిపించింది. తన భర్త తనని తాను ఎప్పుడూ " భావుకుడు" అని అభివర్ణించుకోవడం గుర్తొచ్చింది. "నేను సరిగ్గా ఆరుగంటలకు వేడివేడి కాఫీ ఇవ్వకపోతే తనిలోని 'భావుకుడు' కిటికీ దగ్గరే పడి చచ్చిపోడూ అనుకుంది. ఆమెలో చిత్రంగా ఏదో భావోద్వేగం కలుగసాగింది. తన మదిలో మెదిలే భావాలను ఎవరితోనైనా చెప్పాలనుకుంది. హఠాత్తుగా గుర్తొచ్చిందామెకు తన భర్తకూడా ఆ కిటికీ దగ్గర నిలబడ్డప్పుడల్లా తనతో ఏదో చెప్పాలని ప్రయత్నించడం తనక్కూడా అలాగే అన్పిస్తోంది. మంచం వైపు తిరిగి నిద్రపోతున్న భర్త మొహాన్ని చూస్తూ ఇలా చెప్పింది--

మీరు సూర్యోదయాల్ని చూస్తూ పరవశించే వేళ
మీ కోసం మేం కాఫీలు కలుపుతూ ఉంటాం
మీరు వర్షాన్ని చూసి పులకరించే వేళ
మీకోసం మేం వేడివేడి పకోడీలు వేస్తూ ఉంటాం
మీరు చల్లని వెన్నెల్లో విహరించే వేళ
మీకోసం మేం వంటింటి వేడిలో వంటలు చేస్తూ ఉంటాం
మీరు హాయిగా ఆదమరచి నిద్రపోయే వేళ
మీ పిల్లలకు మేం పాలిస్తూ, జోకొడుతూ ఉంటాం

గోడ గడియారం మ్రోతతో ఉలిక్కపడి టైం చూసింది. పన్నెండు గంటలయింది. బాబోయ్! అప్పుడే పన్నెండు గంటలయింది. కానీ నిద్రరావటంలేదు. ఇప్పుడు నిద్రపోకపోతే రేపు ఉదయం అయిదు గంటలకు లేవలేను. రేపు ఉదయం అయిదు గంటలకు నిద్రలేవకపోతే అమ్మో! ఇంకా ఏమైనా ఉందా. కాలచక్రం స్తంభించిపోదూ!

గబగబా వెళ్ళి పడుకుంది రాధ. నిద్ర రాకపోయినా, నిద్రపోవడం ఇష్టం లేకపోయినా నిద్ర పోవాలని విశ్వప్రయత్నం చేస్తోంది. నిద్రపోవటమూ, నిద్రలేవటమూ ఏవీ ఆమె యిష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండానే జరిగిపోయాయి.

తనలోని భావుకతను చంపుకుని భర్తలోని భావుకతను పెంచుతున్న ఆమెలో ఏదో తీవ్రమైన అశాంతి బయలుదేరింది. ఆ అశాంతిలో నుండే ఆమె ఖచ్చితంగా తన మార్గాన్ని ఎన్నుకుంటుంది.

* * *

(ఈ కథ వ్రాయడానికి ప్రోత్సాహాన్నిచ్చిన కీ.శే. చక్రవేణుగారికి కన్నీటితో అంకితం)